# అమ్మలాంటి అత్తయ్య

-బెండపూడి రమేష్‌బాబు

ఆ రోజు ఆదివారం. సమయం ఉదయం ఏడుగంటలు కావస్తోంది.

"నందూ" అంటూ కేక పెట్టాడు కిరణ్ పక్క పైనుంచే.

అవతలవైపు నుంచి ఎలాంటి స్పందనా లేదు. పొద్దుటే ఎక్కడికి పోయిందబ్బా అనుకుంటూ పక్క మీద నుంచి లేచి పిల్లల గదిలోకి తొంగి చూసాడు.

అక్కడ మంచంమీద శ్రీజాపై చేయివేసి ముడుచుకుని పడుకున్న నందినిని చూస్తే జాలేసింది కిరణ్‌కి. అస్తమానం గానిగెద్దులా చాకిరి చేస్తూనే వుంటుంది. ఆదివారం నాడైనా కాస్త రెస్ట్ తీసుకోనిలే అనుకున్నాడు.

అతను రెడీ అయి బైటకి ఎక్కడికో బయలుదేరబోయే సమయానికి కూడా నందినీ లేవలేదు.

ఆమెను సమీపించి "నందూ! వంట్లో బాగా లేదా ఏమిటి?" అన్నాడు నుదుటిపై చేయి వేస్తూ.

"కొంచెం నలతగా వుందనిపిస్తే కాసేపు పడుకున్నానండీ" అంది లేవబోతూ.

అందుకామె శరీరం ఎంతమాత్రం సహకరించలేదు సరికదా... లేవబోయి బాధతో మళ్లీ పడుకుంది.

"ఏమయింది నందూ బాధతో మూలుగుతున్నావు?" అన్నాడు.

"నడుం బాగా పట్టేసినట్టుందండీ"

"నిద్రలో పట్టేసి వుంటుందిలే. ఏం కంగారు పడకు. అదే తగ్గుతుందిలే నిదానంగా" అన్నాడు కూల్‌గా.

"లేదండీ. రాత్రి నుండి బాగా బాధ పెడుతోంది.

"సరే పదిగంటలకు డాక్టర్ దగ్గరకు వెళ్లి చూపించుకో" అన్నాడు.

కిరణ్ మాటలు విన్న నందిని మనసు బాధతో మూలిగింది.

డాక్టర్ దగ్గరకు తనెలా వెళ్లాలి? ఏదో క్యాజువల్‌గా అడగాలని అడిగాడు తప్పితే ఆ మాటల్లో ఆప్యాయత ఉందా? అసలు తను నడిచే స్థితిలో వుందా?

ఇంట్లో ఎవరికి ఏ కొంచెం నలత అనిపించినా రాత్రిళ్లు కూడా తనని నిద్ర పోనివ్వరే? కానీ తనకి వంట్లో బాగా లేకపోతే ఎవరి సుఖం వాళ్లు చూసుకుంటున్నారలేగానీ అసలు తన గురించి కొంచెమైనా పట్టించుకోరే? అనుకుంది బాధగా నందిని.

"నందూ! తలుపేసుకో. నేను బయటకు వెళ్తున్నాను" అన్న మాటలు ఎక్కడో దూరం నుంచి వినిపించినట్లయింది.

నందినీ అలాగే పడుకుంది. నడుం దగ్గర ఒకటే నొప్పి. అది కాళ్ల నరాల్లోకి పాకి మొద్దుబారిన ఫీలింగ్.

శ్రీజా నిద్ర లేచి "మమ్మీ... ఆకలేస్తోంది పాలు కావాలి" అని గోల చేయసాగింది.

మంచానికి ఆసరా చేసుకుని మెల్లగా లేచింది.

కళ్లు తిరిగినట్లనిపించింది. అప్పుడు గుర్తుకొచ్చింది ఆమెకి. రాత్రి శనివారం కదా... అన్నం తినలేదని. మెల్లగా గోడవారగా నడిచి హాల్లోకి వచ్చింది.

నేలమీద విడిచి పారేసిన బట్టలూ, ఫ్యాన్ గాలికి ఇల్లంతా పరుచుకున్న ఆ రోజు పేపరూ, గుమ్మం మొదట్లో పాల ప్యాకెట్లు, డైనింగ్ టేబుల్‌పై అంట్ల గిన్నెలు... ఇల్లంతా చిందరవందరగా ఉంది.

"శ్రీజా... కాస్త ఆ పేపర్లు సర్దరాదటే" అంది.

శ్రీజా టీవీలో ఛానల్స్ మారుస్తూ తన మాటకు సమాధానం చెప్పలేదు. తండ్రి పోలికలు కదూ బుద్ధులెక్కడికి పోతాయి అనుకుంది మనసులో.

శ్రీజాకి పాలు కలిపి ఇచ్చింది. మాట్లాడకుండా కప్పందుకుంది శ్రీజ. వంట్లో నీరసం దానికితోడు నడుం నొప్పితో నిలబడే వోపిక లేక తిరిగి మళ్లీ బెడ్‌రూమ్‌లోకి వచ్చి పడుకుంది. శ్రీజా టీవీ చూస్తూ కాలక్షేపం చేస్తోంది. అలాగే మగత నిద్రలోకి జారుకుంది నందిని.

★★★

ఎక్కడెక్కడో కాలక్షేపం చేసి పన్నెండుగంటలకు ఇంటికి చేరాడు కిరణ్.

"నందినీ! హాస్పిటల్‌కు పోలేదా?" అన్నాడు కుర్చీ లాక్కుని ఆమె బెడ్ పక్కనే కూర్చుంటూ.

నందినీ మౌనంగా ఉంది.

"నందినీ నిన్నే... హాస్పిటల్‌కు పోలేదా?" అన్నాడు రెట్టించి అడుగుతూ.

"నాకసలు వోపిక లేదండీ" అంది నీరసంగా.


"ఓపిక లేదని కూర్చుంటే రోగం తగ్గుతుందా? ఏ ఆటోలోనో, రిక్షాలోనో పోవాలిగానీ" అన్నాడు.

"ఆటోలో పోయే ఓపిక ఉంటే హాస్పిటల్‌కు దేనికిపోనూ" అంది.

"నందినీ! మరీ మొండిగా మాట్లాడకు. హాస్పిటల్ ఎంత దూరం ఉంది చెప్పు... మన వీధి చివరేగా" అన్నాడు.

"అదే తగ్గుతుందిలెండి" అంది నిరాసక్తిగా.

కిరణ్ మిన్నకుండిపోయాడు. ఇంట్లో వంట కార్యక్రమాలేవీ లేవని తెలుసుకున్న కిరణ్ కూతుర్ని తీసుకుని బయటకు వెళ్లాడు భోజనం



చేయడానికి. సాయంత్రం నాలుగుగంటలు కావస్తోంది.

సెల్ అదే పనిగా మోగుతూ ఉండడంతో నందినికి మెలకువ వచ్చింది. కానీ తనకు సెల్ తీసే వోపిక కూడా లేకపోవడంతో అలాగే మిన్నకుండిపోయింది.

పక్క గదిలోంచి లేచి వచ్చిన కిరణ్ "నందూ! సెల్ అదేపనిగా రింగ్ అవుతుంటే నీకసలు వినిపించడంలేదా? కాస్త తీసి చూడవచ్చుగా?" అన్నాడు విసుగ్గా.

"నడుం నొప్పితో కదల్లేకపోతున్నానండీ" అంది.

"హాస్పిటల్‌కు వెళ్లి చూపించుకో అంటే కదలవ్. అసలు నా మాట ఎప్పుడు విన్నావు కనుక... ఏ పని చెప్పినా ఇదిగో ఈ వంక చూపిస్తుంటావు? ఛీ...ఛీ... చస్తున్నా" అన్నాడు విసుగ్గా.

నందినీ మనస్సు చివుక్కుమంది. తన ఆరోగ్య పరిస్థితి తనకి తెలీదా? ఈ వంకతో పడుకున్నానా? ఏ భార్య అయినా అనారోగ్యం పేరుతో నటిస్తుందా? ఆ మాత్రం అర్థం చేసుకోలేని ఇతన్ని ఏమనుకోవాలి? అనుకుంది బాధగా.

సెల్ ఆన్ చేసి మాట్లాడసాగాడు కిరణ్. అవతల వైపునుండి కిరణ్ వాళ్లమ్మగారు మాట్లాడుతున్నారు.

యోగక్షేమాలన్నీ అయ్యాక నందినీకి వంట్లో బాగాలేదన్న విషయం, హోటల్లో భోజనం చేసిన సంగతి చెబుతూ ఓ నాలుగు రోజులు ఉండిపోయేలా రావాల్సిందిగా కోరి ఫోన్ కట్ చేసాడు.

★★★

తెల్లవారేసరికల్లా వూరి నుండి వచ్చింది కిరణ్ తల్లి సులోచన. రావడంతోనే కోడలు గదిలోకి వెళ్లింది.

నుదుటిపై చేయివేసి చూసింది. నందినీ వొళ్లు వెచ్చగా తగిలింది.

"ఏరా! నందినిని హాస్పిటల్‌కు తీసుకెళ్లి చూపించలేదా?" అందామె.

"లేదమ్మా... వెళ్లి చూపించుకోమన్నాను."

"పెళ్లాన్ని హాస్పిటల్‌కు కూడా తీసుకెళ్లలేనంత బిజీ రాచకార్యాలేం వెలగబెడుతున్నావు?" అంది నిష్టూరంగా.

"నిద్రలో నడుం పట్టేసి ఉంటుందమ్మా?"

"అది నువ్వనుకుంటే సరిపోతుందా? ఆ విషయం నిర్ణయించాల్సింది డాక్టర్లు" అంది కోపంగా.

"నన్ను బైటెయ్యాలని కంకణం కట్టుకున్నట్లుందిలేమ్మా. అందుకే హాస్పిటల్‌కి పొమ్మనా పోకుండా భీష్మించుక్కూర్చుంది" అన్నాడు కోపంగా.

"నోర్మూయ్. అతి తెలివితేటలు నేర్చుకుంటున్నావా? దానికి నీమీద ఎంత ప్రేమ వుందో నీకు తెలీదా? మొన్న నీకు టైఫాయిడ్ జ్వరం వస్తే ఎంత శ్రమ పడిందో మర్చిపోయావా? నీ ఆరోగ్యం బాగుపడాలని మొక్కని దేవుడులేడు, చెయ్యని పూజలు లేవు. ఇవన్నీ మర్చిపోయి దానికి రెండురోజుల నుంచి వొంట్లో బాగా లేకపోతే హాస్పిటల్‌కు తీసుకువెళ్లలేదంటే అసలు నిన్నేమనుకోవాలి?" అంది.

"ఆయన తప్పేం లేదత్తయ్యా. ఆయన రమ్మనమనే అన్నారు. నేనే వెళ్లలేదు" అంది నందిని.

"నందినీ! నువ్వు వూరుకోమ్మా. భర్తమీద ప్రేమ ఉండడం మంచిదే. అంతమాత్రాన వాడి తప్పుల్ని కప్పిపుచ్చి నీమీద వేసుకోవడం సరికాదు. వాడి బాధ్యత వాడికి గుర్తు చేయడం తల్లిగా నాకెంత బాధ్యత ఉందో నీ భర్తగా వాడి కర్తవ్యం వాడు నిర్వర్తించడంలో అంతే బాధ్యత ఉంది" అంది.

ఆమె మాటలు కిరణ్‌లో ఆలోచనలు రేకెత్తించసాగాయి. నందినిపై తల్లికున్న ప్రేమకు చలించిపోయాడు.

తనెంత తప్పు చేసాడో అతనికి అర్థమయింది. అహర్నిశలూ శ్రమించే నందిని విషయంలో తనెంత అశ్రద్ధగా ఉన్నాడో తలచుకుంటే సిగ్గనిపించింది. నందినిపై తన తల్లికి ఉన్నంత ప్రేమ తనకు లేనందుకు చిన్నతనం అనిపించింది.

కిరణ్ కుర్చీలోంచి లేస్తూ నందిని నుదుటిపై ఆప్యాయంగా చేయి వేసాడు.

"నందూ! ఆటో తెస్తాను. హాస్పిటల్‌కు వెళ్దాం రెడీగా ఉండు" అన్నాడు కిరణ్.

అమ్మలాంటి అత్తయ్యను తనకిచ్చిన ఆ దేవుడికి మనస్సులోనే కృతజ్ఞతలు తెలుపుకుంది నందిని.

★



## పేరు తెచ్చే 'కథ'

నటనలో జెనీలియా స్టయిలే వేరు. తాజాగా ఆమె నటిస్తున్న 'కథ' సినిమా కూడా ఆ కోవలోకి చేరుతుందని టాలీవుడ్ కబుర్లు. ఓ కొత్త హీరోకి జంటగా కొత్త దర్శకుడితో జెనీలియా చేస్తున్న 'కథ' ఆమెకి మరింత ఖ్యాతిని తెస్తుందని సినీవాలాలు చెబుతున్నారు. ప్రస్తుతం హిందీ రంగంపైనే ఎక్కువగా తన ఫోకస్‌ని పెట్టిన జెనీలియా 'కథ' కనుక హిట్టయితే వచ్చే ఆఫర్లని మరి ఎంతవరకూ ఒప్పుకుంటుందో!

